అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
ఆదివారం 02 ఏప్రిల్ 2023

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-లింగంపేట్

అక్షరాస్యత ఉంటేనే అన్ని సాధించగలమని ఐకెపిఎం శ్రీనివాస్ అన్నారు. లింగంపేట మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామంలో శనివారం ఆజాది కా అమృత మహోత్సవ కార్యక్రమంలో గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలలో, గ్రామ సంఘాలకు మహిళలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు గ్రామ సంఘాల సభ్యులకు విద్యార్థిని విద్యార్థులకుముఖ్యంగా సంఘ సభ్యుల మహిళలులకు, విద్యార్థులకు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిల్ రెడ్డి, సిసి నాజర్, వీఎల్ఏ విజయ, సిఏలు అర్చన, హేమలత, శ్యామలత, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎల్లయ్య (52) కుమారుడు 5 నెలల క్రితం తన మరణించడంతో తీవ్రంగా కుంగుపాటుకు గురై అనారోగ్యం పాలైయ్యాడు. ఎన్ని ఆస్పత్రులు చూపించిన ఆరోగ్యం బాగు కాలేదు. చికిత్స నిమిత్తం చేసిన అప్పునకు తోడు కొడుకు మృతిచెందడంతో తీవ్ర మనస్తాపానికి గురై వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఎల్లయ్యను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినటుట ఎస్ఐ ఆనంద్ గౌడ్ తెలిపారు.

బీఆర్ఎస్ రైతు సంక్షేమం.. దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమం కోసం చేపడుతున్న అభివృద్ధి పనులు దేశానికి ఆదర్శమని జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే అన్నారు. శనివారం డోంగ్లి మండల కేంద్రంలో మద్దతు ధరతో పొద్దుతిరుగుడు పంట ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల నిర్దేశించి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చేపడుతున్న అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి రైతులకు సాగునీటి సౌకర్యం 24 గంటలపాటు వ్యవసాయ బోర్లకు ఉచిత కరెంటు రైతులు పండించే పంటలకు మద్దతు ధర కల్పించడం రైతుబంధు పథకం కింద ఎకరానికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించడం రైతు చనిపోతే రైతు బీమా కింద ఐదు లక్షల రూపాయలు అందించడం ఇలాంటి పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదని ఒక్క తెలంగాణలోనే సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న రైతుల సంక్షేమ కోసం కృషి చేసేందుకు సీఎం కేసీఆర్ అబ్‌కి బార్ కిసాన్ సర్కార్ నినాదంతో ముందుకు వెళ్తున్నారని అన్నారు.

డోంగ్లి సింగల్ విండో ఆధ్వర్యంలో పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని, మద్దతు ధర క్వింటాలుకు 6400 కల్పించినట్టు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డోంగ్లి సింగిల్ విండో చైర్మన్ రామ్ పటేల్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు వాగ్మారే లక్ష్మీబాయి, మండల జెడ్పిటిసి సభ్యురాలు అనిత కథలయ్య, డోంగ్లి సింగిల్ విండో వైస్ చైర్మన్ విజయ్, డోంగ్లి సర్పంచ్ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు శశాంక్ పాటిల్, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ దిగంబరావ్ పాటిల్, డోంగ్లి ఎంపీటీసీ సభ్యులు దిన్ దయాల్, తహసీల్దార్ క్రాంతి కుమార్, సింగిల్ విండో కార్యదర్శి గంగాధర్, డోంగ్లి మండలంలోని వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలతో నిలదీత

బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్

- పసుపు బోర్డుపై బీఆర్ఎస్ వ్యంగ్యంగా ఫ్లెక్సీలు
- బీఆర్ఎస్ హామీలపై కాషాయ నేతల కౌంటర్లు
- వాగ్దానాలపై నోరెత్తని నేతలు
- అంతిమంగా మోసపోయిన ప్రజలు, రైతులు




నగరంలో వివిధ చోట్ల వెలసిన ఫ్లెక్సీలు



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మైక్‌లు పట్టి కేకలు పెట్టడం, టీవీ డిబెటుల్లో గొంతులు చించుకోవడం, ట్విట్టర్ వేదికగా నిలదీయడం రోటీన్‌గా మారిందకున్నారో లేక కొత్త పద్ధతుల్లో తమ ప్రత్యర్థులను ప్రశ్నించాలనుకున్నారో తెలీదు కానీ నిజామాబాద్‌లో రెండు రోజులుగా కొత్త ట్రెండ్ నడుస్తోంది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఫ్లెక్సీలతో ప్రశ్నిస్తున్నారు. మొదట ఈ ట్రెండ్‌ను బీఆర్ఎస్ ప్రారంభించగా.. కౌంటర్‌గా బీజేపీ సైతం పాటిస్తోంది. 'పసుపు బోర్డు.. ఇది మా ఎంపీగారు తెచ్చిన పసుపు బోర్డు' అని జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ మొదట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. పసుపు రంగులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఇదే బోర్డు అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. అయితే మరునాడు శనివారం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను ప్రశ్నిస్తూ బీజేపీ నేతలు కౌంటర్‌గా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు జిల్లా ప్రజలకు పెద్దఎత్తున హామీలు గుప్పించిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ సర్కారు ఆ సమయంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు, నిరుద్యోగ భృతి, ఎన్ఆర్ఐ సెల్, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థికసాయం తదితర వాగ్దానాలు చేశారు. ఇక బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రధానంగా పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. అది కూడా తనను ఎంపీగా గెలిపించిన ఐదు రోజుల్లోనే పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని, ఇందుకు సంబంధించి బాండ్ పేపర్ కూడా విడుదల చేశారు. కానీ అధికారంలోకి వచ్చి యేండ్లు గడుస్తున్నా ఈ హామీలు నెరవేర్చలేదు. ఈ హామీలపై పలు సందర్భాల్లో రెండు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు, ఆరోపణలు గుప్పించుకున్నారు. అయితే పసుపు బోర్డుపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో బీఆర్ఎస్ నేతలు ఎంపీ అరవింద్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటికి కౌంటర్‌గా బీజేపీ నేతలు కూడా శనివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అందులో ప్రధానంగా 'నిరుపేదలకు కేసీఆర్ ఇచ్చిన 120 గజాల డబల్‌బెడ్రూం ఇళ్లు' అని, 'నెలకు రూ.3016 నిరుద్యోగ భృతి ఇదిగో.. సీఎం గారు మాట ఇస్తే తల నరుక్కుంటాడు కాని ఇచ్చిన మాట తప్పడు' '500 కోట్లతో కేసీఆర్ ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ సెల్' అంటూ ఓ పాత సెల్‌ఫోన్ డిజైన్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

హామీలపై ప్రశ్నలేనా? ఆ వాగ్దానాలకు సమాధానమేది?

బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఫ్లెక్సీల ఆధారంగా పరస్పరం రెండు పార్టీలు చేసిన వాగ్దానాలను నిలదీస్తున్నారు తప్ప... ఆ హామీలను ఎప్పుడు అమలు చేస్తాం? అన్న దానికి మాత్రం ఫ్లెక్సీలలో సమాధానం ఇవ్వడం లేదు. పసుపు బోర్డుపై ఎంపీ మౌనం వహిస్తుండగా.. ఎన్ఆర్ఐ సెల్, నిరుద్యోగ భృతి, ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం తదితర హామీల అమలుపై ఇటు బీఆర్ఎస్ నేతల నుంచి సమాధానం రావడం లేదు. ఒకవేళ ఆ సమాధానాలు కూడా వచ్చి ఉంటే జిల్లా ప్రజలకు, రైతులకు ప్రయోజనం జరిగేదని మాట్లాడుకుంటున్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు

- అలరించిన 'దంగల్' సినిమా నటీ కుస్తీ


యువకుడితో తలపడుతున్న దంగల్ నటీ

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలో శ్రీరామ నవమి పురస్కరించు కొని సర్దార్ వల్లభాయ్ పటేల్ (పాత చావిడి ఆవరణలో) శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు హెూరా హెూరీగా సాగాయి. ఉదయం 8 గంటల నుండే 10 రూపాయలతో ప్రారంభించిన కుస్తీ పోటీలకు మండలం తో పాటు బాన్సువాడ డివిజన్, నారాయణ ఖేడ్ పరిధిలోని సిర్గాపూర్, కల్హేర్, కంగ్టి మండలాలతో పాటు జుక్కల్, బిచ్కుందా, మహారాష్ట్ర దేగులూర్, విదర్భ జిల్లాల సుదూర ప్రాంతాల మల్ల యోధులు హెూరా హెూరీగా తలపడి ప్రత్యార్థులను చిత్తు చేసి నగదు పారితోషకము అందుకున్నారు.

కాగా దంగల్ సినిమాలో నటించిన (మహారాష్ట్రలోని విదర్భ జిల్లా) పుస్పథ్ గ్రామానికి చెందిన పల్లవి పోవా.. పురుషులతో కుస్తీ పడ్డారు. ప్రత్యర్థులను చిత్తు చేసి బహుమతులు, ప్రశంసలు అందుకున్నారు.

సెమీ ఫైనల్‌లో గెలుపొందిన మల్ల యోధునికి 5 తులాల వెండి రింగు, ఫైనల్‌లో గెలుపొందిన గోదుమేగావ్ గ్రామానికి చెందిన దత్తుకు 7 తులాల వెండి రింగు అందజేశారు. కాగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సా గౌడ్, శశి, కొఠారి ప్రభాకర్, గూడాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండలంలోని బాణాపూర్ గ్రామంలో శనివారం కుస్తీ పోటీలు నిర్వహించినట్టు సర్పంచ్ బండి కవిత నర్సింలు తెలిపారు. మల్లయోధులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామపంచాయతీ సభ్యులు ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గుడాడిరెడ్డి సంఘం కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశవనగర్

మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో శనివారం నూతన గుడాడిరెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మామిడి సంజీవరెడ్డి ప్రధాన కార్యదర్శిగా కాటిపల్లి రాజిరెడ్డి, కోశాధికారి యాల్ల రాజిరెడ్డి, మామిడి సాయిరెడ్డి, గున్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

డ్యామిట్.. కథ అడ్డం తిరిగింది


మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

నవతెలంగాణ-నవీపేట్

తప్పుడు ఎస్సీ సర్టిఫికెట్‌తో తప్పుడు అట్రాసిటీ కేసులు నమోదు చేస్తున్నాడన్న ప్రతిపక్ష పార్టీ విమర్శలకు కౌంటర్ ప్రెస్ మీట్ తో సమాధానం ఇవ్వాలనుకున్న బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ నర్సింగ్ రావు సర్పంచ్ క్రైస్తవురాలని ఒప్పుకోవడంతో డ్యామేజ్ కథ అడ్డం తిరిగింది అన్నట్లు అయిందని స్థానికులు పెదవి విరుస్తున్నారు. నవీపేట్ మండలంలోని లక్ష్మీ కిసాన్ ఫారంలో ఉగాది పండుగ రోజు రామాలయం వద్ద ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ తమ వ్యాపార ప్రచారంతో ఫ్లెక్సీ పెడితే దురుద్దేశంతో సర్పంచ్ భర్త అసభ్యకరంగా దూషించి కాలితో తన్ని తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని బాధితుడు వీడియోలు, ఆడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో జిల్లాలో సంచలనంగా మారింది. బాధితులకు అండగా ప్రతిపక్ష నేతలు సర్పంచ్ కుటుంబం కన్వర్టెడ్ క్రిస్టియన్ అని తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రెస్ మీట్ పెట్టారు. దానికి కౌంటర్‌గా బీఆర్ఎస్ నేతలు అదే గ్రామంలో ప్రెస్‌మీట్ పెట్టి భార్య క్రైస్తవురాలైనప్పటికీ భర్త ఎస్సీ సర్టిఫికెట్ ఉంటే ఎస్సీ అవుతుందని చట్టం చెబుతుందని చెప్పడంతో ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలు ఆ వీడియోని పలుమార్లు ట్రోల్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో డామిట్ కథ అడ్డం తిరిగిందని అవాక్కయ్యారు.

ఆలయ నిర్మాణ పనులను ప్రారంభం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని మోటాటిపల్లి గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న మహంకాళి ఆలయ నిర్మాణ పనులను శనివారం సంఘ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘ సభ్యులు రాజిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో మహంకాళి ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని, రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న మహంకాళి ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం ప్రమాదంలోకి..

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ

- అదానీపై జేపీసీ విచారణ చేయించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్
- బీజేపీకి హటావో.. దేశ్‌కి బచావ్ నినాదంతో ఇంటింటా ప్రచారం


బైక్ ర్యాలీలో నినాదాలు చేస్తున్న సాంబశివరావు, నాయకులు..



మాట్లాడుతున్న సాంబశివరావు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

దేశంలో సంక్లిష్ట పరిస్థితులు నెలకొని ఉన్నాయని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపో యిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిపాలన ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుందని అన్నారు. అప్పటి ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ కాలంలో కనీస హక్కులు ఉండేవని, ప్రస్తుత మోడీ ప్రభుత్వ హాయంలో దేశంలో విపక్షాలకు, ప్రజలకు కనీస హక్కులు లేకుండా పోయాయని అన్నారు. శనివారం నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సిపిఐ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడు తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి రాబోయే కాలంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. రోజురోజుకు ధరలు ఆకాశాన్ని అంటుతున్నా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టడం లేదని, అందుకు భిన్నంగా ప్రజల మధ్య మతం చిచ్చు రేపి మోడీ పరిపాలిస్తున్నారని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తూ రాజ్యాంగ స్థానంలో మనుధర్మం తీసుకురానికి ప్రయత్నాలకు సాగిస్తుందని వెల్లడించారు.

మోడీ స్నేహితులు ఆదాని లక్షల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని, 10 లక్షల కోట్లు కుంభ కోసం చేసినట్టు కూనంనేని తెలిపారు. మోడీ షెల్ కంపెనీలను ప్రమోట్ చేసి లక్షల కోట్లు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ఆదాని కుంభకోణంపై జేపీసీ ఏర్పాటు చేసి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలు కుదేల్ అయ్యాయని వెల్లడించారు. జేపీసీ విచారణ చేపట్టకుండా మోడీ ప్రభుత్వం అడ్డుకుంటుందని, జెపిసి డిమాండ్ చేస్తున్న వివిధ పార్టీల నాయకులపై కేసులు నమోదు చేస్తుంది ఆరోపించారు. అందులో భాగంగానే కాంగ్రెస్ నాయకులు రాహుల్ పై చర్యలు అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ పై కక్ష సాధింపు చర్యలు కేంద్ర చేపట్టిందని, గుజరాత్ సూరత్ కోర్టు శిక్ష, వెంటనే ఎంపీగా అనర్హత, ప్రభుత్వం కేటించిన క్వార్టర్స్ ఖాళీ చేయించిన ఇదంతా ప్రభుత్వ కుట్రలో భాగమేనని ఆయన స్పష్టం చేశారు.

కేంద్రం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఈ నెల 14వ తేదీ నుంచి 15వ తేదీ వరకు బీజేపీ హటావో.. దేశ్ కో బచావో అనే నినాదంతో ప్రతి ఇంటికి వెళ్తే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. కుదిరితే పొత్తులుంటాయని, లేకుంటే సీపీఐ, సీపీఐ(ఎం) కలిసి పోటీ చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంజర భూమన్న, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్. దశరథ్ సిపిఐ జిల్లా నాయకులు వై ఓమయ్య,రాజేశ్వర్, రాజన్న, బాబు, ఏ విటల్ గౌడ్, దుబాస్ రాములు, బాలరాజ్, రాజమణి, స్వరూప రాణి పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేత



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట, రెడ్డిపేట్, సింగరాయపల్లి, అన్నారం, బొట్టు తాండ, స్కూల్ తాండ, జగదాంబ తండా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు శనివారం కామారెడ్డి లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ విప్పు గంప గోవర్ధన్, స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ఎంపీపీ దశరథ్ రెడ్డితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బొమ్మిడి రాంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు రాజా గౌడ్, సర్పంచులు అధికం మహేశ్వరి నర్సాగౌడ్, సునంద ప్రభాకర్‌రావు, కూడెల్లి అమృత బాలరాజ్, లలితా బుచ్చిరెడ్డి, రాజు నాయక్, రెడ్డి నాయక్, ఎంపీటీసీలు గడ్డం చంద్రకళ గంగారెడ్డి, మండల బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, మండల యూత్ అధ్యక్షులు గడ్డం రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

- పలు గ్రామాల్లో కలెక్టర్ ఆకస్మిక పర్యటన


పనులను పరిశీలించి ఆరా తీస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ శనివారం ఆకస్మికంగా పర్యటించారు. మొదట మహమ్మదాబాద్ గ్రామంలో రూర్బన్ పథకంలో చేపట్టిన తీగజాతి పందిరి పంటల అభివృద్ధి పనులను రైతుల పంటపొలాలలోకి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను రైతులను, సర్పంచ్ సాయులు, ఎంపిడివో నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు గ్రామ పంచాయతీని సందర్శించారు. జీపీ సర్పంచ్ సాయులు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. మహమ్మదాబాద్ తండాలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ 25కేవి ఇవ్వాలని విద్యుత్ అధికారులకు తండా వాసుల నాయకుడు జాదవ్ రాజు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ట్రాన్స్ కో ఎస్సీకి ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా హైవే రోడ్డులో తమ గ్రామానికి సూచిక బోర్డు ఏర్పాటు చేయడం లేదని, గూగుల్ మ్యాప్ లో తమ గ్రామం హైవేలో నమోదు కాలేదని సర్పంచ్ వినతిపత్రం అందించారు. సావర్ గావ్ జీపీ నూతన బిల్డింగ్ పనులను ఉన్న నిధులతో పదిహేను రోజులలో పూర్తి చేయాలని ఏఈ శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. చిన్న ఎడ్గి తీగ జాతి పందిరి పనులు వెనుక పడ్డాయని పూర్తి చేయాలని సంబంధిత అధికారికి ఆదేశించారు. పడంపల్లి చౌరస్తా వద్ద నిర్మిస్తున్న బస్టాండ్ త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని రూర్బన్ అధికారులకు ఆదేశించారు. జుక్కల్ మండల కేంద్రంలోని ఆడిటోరియం, ఆక్సీజన్ పార్క్‌ను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూర్బన్ పథకంలోని పెండింగ్ పనులు పదిహేను రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీవో యాదగిరి, ఎంపిడివో, ఎంపివో , ఆర్ఐ రామ్ పటేల్, పీఆర్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులున్నారు.

పుల్కల్ ఇసుక క్వారీ మూసివేత

నవతెలంగాణ ఎఫెక్ట్..



నిలిచిన తవ్వకాలు.. తిరిగి వెళ్తున్న లారీలు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామ శివారులో మంజీర పరివాహక ప్రాంతం నుండి నిబంధనలకు విరుద్ధంగా మంజీరా నది నడిబొడ్డున ఐదు నుండి పది మీటర్ల లోతు నుంచి యంత్రాలతో ఇసుకను తవ్వుతూ వే బిల్లులు లేకుండా యథేచ్ఛగా రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న విషయం నవతెలంగాణ వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. గురువారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా సెలవు ఉన్నప్పటికీ అధికారుల అండదండలతో వే బిల్లులు లేకుండానే ఇసుక రవాణా చేస్తున్నారని శుక్రవారం నవతెలంగాణలో ప్రచురమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు టిఎస్ఎండిసి అధికారులు, రెవెన్యూ అధికారులు పుల్కల్ ఇసుక క్వారీని మూసివేయించారు. మంజీర పరివాహక ప్రాంతం లోపలికి లారీలు వెళ్లకుండా వీఆర్ఏలను నియమించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

యువకుడి వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య


మృతిచెందిన రాజేశ్వరి

నవతెలంగాణ-మాక్లూర్

వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని మాణిక్‌బండార్‌లో శనివరం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల వివరాల మేరకు.. మాణిక్‌బండార్ తండాకు చెందిన కేతవత్ రాజేశ్వరి (19), అభిలాష్ నాలుగేండ్లుగా ప్రేమించుకుంటున్నారు. రాజేశ్వరి డిగ్రి పూర్తి చేసి హైదరాబాద్‌లోని జ్యువెలరీ షాప్ లో ఉద్యోగం చేస్తోంది. అభిలాష్ ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తూ వ్యవసాయం చేస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి అభిలాష్.. రాజేశ్వరిని ఇతరులతో సంబంధం ఉందంటూ వేధించడం మొదలు పెట్టాడు. ఇది భరించలేక హైదరాబాద్ రెండు నెలల క్రితం జ్యువెలరీ షాప్‌లో పని చూసుకొని వెళ్ళింది. ఫోన్ ద్వారా ప్రతి రోజూ అసహ్యంగా మాట్లాడటంతో ఇంటికి వచ్చి మార్చి 23న సాయంత్రం 7 గంటలకు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. కుటుంబీకులు గమనించి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్చి 28న మరో ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి తల్లి అనూష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. నిందితుడు అభిలాష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


మృతిచెందిన కళావతి

నవతెలంగాణ-భిక్కనూర్

కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపం చెందిన వివాహిత.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని లక్ష్మీ నగర్ తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులకు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కళావతి (28) కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపం చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా.. కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు.

కళావతి తల్లిదండ్రులకు సమాచారం అందడంతో తన కూతురు కళావతిని కుటుంబ సభ్యులే కొట్టి చంపారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్ తరలించినట్టు ఎస్సై ఆనంద్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
2
ఆదివారం 02 ఏప్రిల్ 2023

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



నవతెలంగాణ-భీంగల్

మండలంలోని పల్లికొండ గ్రామానికి చెందిన కర్రోల్ల సుమన్ కుటుంబ సభ్యులకు ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి ఆర్థిక సాయాన్ని అందజేశారు. గల్ఫ్ వెళ్లి పనిలేక తిరిగి వచ్చిన సుమన్ ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సునీల్‌రెడ్డి శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కూతళ్ల చదువుకు రూ.25 వేలను డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సునీల్ యువసేన నాయకులున్నారు.

కుల సంఘాలకు ప్రొసీడింగ్ కాపీల అందజేత



నవతెలంగాణ-భీంగల్

మండలంలోని గోన్‌గొప్పుల, చేంగల్, సికింద్రాపూర్ గ్రామాలకు చెందిన పలు కుల సంఘాల భవన నిర్మాణాలకు మండల బీఆర్ఎస్ నాయకులు ప్రొసిడింగ్ కాపీలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అదానీని కాపాడేందుకు

రాహుల్ గాంధీపై అనర్హత వేటు

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోడీ ప్రభుత్వం
- కుల మత విద్వేషాలతో దేశాన్ని విభజిస్తోంది
- రాహుల్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- కేంద్రంపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

అదానీని కాపాడేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కుల మత విద్వేషాలతో దేశాన్ని విభజిస్తోందని.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు పీసీసీ ఆదేశాల మేరకు గత నెల కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు.


ఎడపల్లి : మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : పార్లమెంట్ సభ్యునిపై అనర్హత వేటు వేయడానికి పార్లమెంట్ సెక్రెటరీ రాష్ట్రపతి నుంచి ఆమోదం తీసుకొని సభ్యునికి నోటీసు ఇచ్చిన తర్వాత రద్దు చేయాలని, కానీ ఆగమేఘాల మీద రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని, అంతేకాకుండా రాహుల్ గాంధీని నెల రోజుల్లోనే ఇల్లు ఖాళీ చేయమనడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎడపల్లి కాంగ్రెస్ మండలాధ్యక్షులు పులి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యనిర్వాహక అధ్యక్షులు పోచయ్య, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు లింగం తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అనర్హత వేయడం అప్రజాస్వామికం..

బోధన్ : కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం అనర్హత వేటు వేయడం అప్రజాస్వామ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గడుగు గంగాధర్ అన్నారు. సాలూర మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పనిచేస్తూ ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. నరేంద్ర మోడీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయక, ధరలు పెంచుతూ దేశ ప్రజలకు ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయంలో నిరుపేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. ప్రధాని తక్షణమే రాహుల్ గాంధీ పై విధించిన అనర్హతను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గొంతునొక్కే చర్యలు..

మోర్తాడ్ : రాహుల్‌గాంధీ చేపడుతున్న జోడ యాత్రలో భాగంగా ప్రజాదరణను చూసి తన గొంతు నొక్కే ప్రయత్నాలకు బీజేపీ పాల్పడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివనుల్లా శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు, రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించడం బీజేపీ పిరికి పందచర్య అని విమర్శించారు.

మాక్లూర్ : రాహుల్ గాంధీపై అనర్హత వేటు అప్రజాస్వామికమని కాంగ్రెస్ నిజామాబాద్ టౌన్ అసెంబ్లీ అధ్యక్షులు రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో కాంగ్రెస్ మండల కమిటీ అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

వర్ని : ఏఐసీసీ అగ్రనేత, వయనాడ్ పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీపై అక్రమ కేసులు ఎత్తివేయాలని చందూర్ జెడ్పీటీసీ, నిజామాబాద్ జిల్లా జెడ్పీ ఫ్లోర్ అంబర్ సింగ్ మండల కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

జక్రాన్‌పల్లి : రాహుల్ గాంధీపై వేటు వేసి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్‌రెడ్డి అన్నారు. అర్గుల్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాహుల్ గాంధీపై అనర్హత సిగ్గు చేటు..

డిచ్‌పల్లి : రాహుల్ గాంధీపై అనర్హత వేటు సిగ్గు చేటని ఇది ముమ్మాటికి కక్ష సాధింపు చర్యేనని టీపీసీసీ డెలిగేట్ మోత్కురి శేఖర్‌గౌడ్ అన్నారు. ఇందల్‌వాయి, డిచ్‌పల్లి మండల కేంద్రాల్లో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ సెక్రెటరీ భాస్కర్‌రెడ్డి, ఇందల్‌వాయి మండల అధ్యక్షులు మోత్యార్ నవీన్ గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదరణను చూసి ఓర్వలేకే రాహుల్ గాంధీపై కుట్ర..

కమ్మర్‌పల్లి : భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీకి లభించిన ఆదరణను చూసి ఓర్వలేకే ప్రధాని నరేంద్ర మోడీ రాహుల్ గాంధీపై కుట్రకు తెర లేపారని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీరడి భాగ్య అన్నారు. మోడీ కుట్రలో భాగంగానే రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వం రద్దయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుంకెట రవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో నీరడి భాగ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఎంతటి ప్రాణ త్యాగానికైనా కాంగ్రెస్ పార్టీ సిద్ధం..

కోటగిరి : రాహుల్ గాంధీ ఆదరణ చూడలేక పార్లమెంటు నుంచి బయటకు వెళ్లే విధంగా చేయడం అమానుషమైన చర్యని ఎంతటి ప్రాణ త్యాగానికైనా కాంగ్రెస్ పార్టీ సిద్ధమని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాసుల బాలరాజు అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.


కోటగిరి : మాట్లాడుతున్న కాసుల బాలరాజ్

రాహుల్ గాంధీకి పెరుగుతున్న ప్రజాదరణ..

రెంజల్ : దేశంలో నేడు రాహుల్ గాంధీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి అధికార పార్టీలో భయం నెలకొందని, కావాలని ఆయనపై అనర్హత వేటు వేశారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ స్పష్టం చేశారు. మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.


బోధన్ : మాట్లాడుతున్న గడుగు గంగాధర్

రాజకీయ కక్షతోనే రాహుల్‌పై అనర్హత వేటు

ఆర్మూర్ : రాజకీయ కక్షతోనే రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం సరికాదని పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేష్ అన్నారు. పట్టణంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.

కక్ష సాధింపు చర్య..

మోపాల్ : రాహుల్ గాంధీపై కేంద్రం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్, కాంగ్రెస్ ప్రచార కమిటీ జిల్లా చైర్మన్ అన్నారు. మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.

ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్న మోడీ..

భీంగల్ : దేశంలో రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వమ్యాన్ని మోడీ ప్రభుద్వం కూనీ చేస్తుంది యవజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విక్కీయాదవ్ అన్నారు. పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వామి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.


డిచ్‌పల్లి : మాట్లాడుతున్న మోత్కురి శేఖర్‌గౌడ్


కమ్మర్‌పల్లి : మాట్లాడుతున్న నీరడి భాగ్య


వర్ని : చందూర్‌లో మాట్లాడుతున్న అంబర్‌సింగ్

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా జడ్జి సునీత కుంచాల
- ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ


సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మారిన ప్రస్తుత సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా జడ్జి సునీత కుంచాల హితవు పలికారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు శనివారం ఉదయం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల గుండా పులాంగ్ చౌరస్తా వరకు కొనసాగి, తిరిగి అదే మార్గంలో కోర్టు కాంప్లెక్స్ వద్దకు చేరుకుంది. జిల్లా సెషన్స్ జడ్జితో పాటు అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, వివిధ సంఘాల ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు, యువకులు సైకిల్ ర్యాలీలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ.. నేటి రోజుల్లో అనేక మంది వ్యాయామానికి దూరంగా ఉంటున్నారని అన్నారు. సరైన పోషకాహారాన్ని తీసుకోకుండా జంక్ ఫుడ్ వైపు మొగ్గు చూపుతున్నారని, నడకను తగ్గించేశారని తెలిపారు. ఈ పరిణామాలు ఆరోగ్యాలపై దుష్ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మన నిత్య జీవితంలో తారసపడే వారిలో అనేకమంది ఏదో ఒక అనారోగ్య సమస్యతో సతమతం అవుతున్నారని అన్నారు. ఇదివరకు ఎక్కడికి వెళ్లాలన్న సైకిల్ విరివిగా వాడేవారని, ఆరోగ్య సాధనకు ఇది ఎంతగానో దోహదపడేదని జిల్లా జడ్జి గుర్తు చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్య పరిరక్షణ ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సైకిల్ ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ పని ఒత్తిడికి లోను కావాల్సి వస్తోందన్నారు. దీనికి తోడు మారిన ఆహారపు అలవాట్లు అనారోగ్యాల బారిన పడేలా చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా అనేకమంది గుండెపోటుకు గురై అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఆందోళనకరంగా పరిణమించాయని అన్నారు. ఆరోగ్యకర జీవనాల కోసం ప్రతి ఒక్కరూ క్రమబద్ధమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఆరోగ్యాల పట్ల తగిన జాగ్రత్తలు పాటిస్తూ, యోగా, నడక, వ్యాయామాలకు తప్పనిసరిగా సమయం కేటాయించాలని హితవు పలికారు. ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థతో కలిసి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సైకిల్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ ర్యాలీలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జిలు పద్మావతి, శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు భవ్య, సౌందర్య, గిరిజ, రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యుడు రాజేందర్ రెడ్డి, సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధి విజయ్ కుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధి సతీష్ షా, సీనియర్ న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేదార్, ఆశ నారాయణ, భాస్కర్, కోర్ట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం

- బీఎల్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్


మాట్లాడుతున్న దండి వెంకట్

నవతెలంగాణ-నవీపేట్

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఎల్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ విమర్శించారు. మండలంలోని లింగాపూర్ గ్రామపంచాయతీ శాఖాపూర్‌లో బహుజన లెఫ్ట్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో పూర్తిగా విఫలమైందని విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలతో పాటు శానిటేషన్, తాగునీటి సౌకర్యాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే ప్రజలకు శాపంగా మారాయని విమర్శించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత ప్రభుత్వాలను ప్రశ్నించే విధంగా ఉద్యమించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మధు, బీఎల్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, బహుజన లెఫ్ట్ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, శాఖాపూర్ గ్రామస్తులు గంగాధర్, దేవూబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఓఎస్ ఆధ్వర్యంలో క్యాలెండర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

రేషన్ డీలర్ల మిషన్ (ఈపీఓఎస్) ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్ క్యాలెండర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంజనీర్ రాజు, డీలర్లు శ్రీనివాస్, కామని నరేష్, సుదర్శన్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీరామ సత్యనారాయణ ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని కోటార్మూరులో గల విశాఖ కాలనీలోని శ్రీ రమ సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం అష్టమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని బల్యపల్లి సుబ్బరావు గురుస్వామి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉదయం శాంతి మంత్ర పఠనము, గౌరి గణపతి పూజ స్వస్తి పుణ్యాహవాచనము నవగ్రహ, మాతృక యోగిని వాస్తు క్షేత్రపాలకు, సర్వతోభద్ర మండలాధి ఆరాధన, హవనములు స్వామి వారికి అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, డిష్ గంగాధర్, లక్ష్మీనారాయణ, లింబాద్రి, జక్కుల మోహన్, దొంత చిన్న రాములు, లక్ష్మీనరసయ్య, వినాయక అపార్ట్‌మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని, పీ.ఎఫ్, ఈఎస్ఐ చెల్లించుట, వారాంతపు సెలవులు, జాతీయ సెలవులు ఇచ్చుట, కార్మికులకు పనిముట్లు, సబ్బులు, చెప్పులు, నూనె, బట్టలు, రక్షణ పరికరాలు ఇవ్వాలని కోరుతూ శనివారం బోధన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రగతి శీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ 2021 జూన్ నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులకు 30 శాతం పీఆర్సీని పెంచి ఇస్తున్నట్లు ప్రకటించిందని, ఆ ప్రకటన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ రంగంలోని అన్ని డిపార్ట్‌మెంట్లలోని ఉద్యోగులకు, కార్మికులకు పెరిగిన పీఆర్సీని చెల్లించారని డిమాండ్ చేశారు. బోధన్ మున్సిపాలిటీలో పారిశుధ్య రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ కార్మికులకు 2022 నుంచి పెంచిన పీఆర్సీని ఇస్తూ, 2021 జూన్ నుంచి డిసెంబర్ వరకు ఇవ్వకుండా తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. అట్లాగే కార్మికుల వేతనాల నుంచి ప్రతి నెల కట్ చేస్తున్న పీఎఫ్, ఈఎస్ఐల డబ్బులను వారి ఖాతాలలో జమ చేయడం లేదని, దీని మూలంగా కార్మికులు పొందాల్సిన బెనిఫిట్స్ పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అట్లాగే కార్మికులకు పనిముట్లు, రక్షణ పరికరాలు, దుస్తులు అందజేయాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల జరిగే పరిణామాలకు మున్సిపాలిటిదే బాధ్యత అని తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కమర్ అహ్మద్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.పర్వయ్య, కే. గంగామణి, ఎన్.సాయమ్మ, లక్ష్మణ్, జి.రాజు, ఎం.గంగాధర్, కె.సంజీవ్, మరియమ్మ, కె.పోశెట్టి, ఈ.పోశవ్వ తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న నాయకులు, కార్మికులు

రేపటి నుంచే పదవ తరగతి పరీక్షలు

- పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి
- పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం
- వెల్లడించిన ఎంఈవోలు


రెంజల్‌లోని ఓ పరీక్ష కేంద్రంలో శుభ్రత పనులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

సోమవారం నుంచి నిర్వహించే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అన్ని విధాల ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయా మండలాల ఎంఈవోలు తెలిపారు.

బోధన్ : విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి బస్సు సౌకర్యం కల్పించినట్టు మండల విద్యాధికారి నాగనాథ్ తెలిపారు. హాల్ టికెట్ చూపిన విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉచితంగా బస్సులో ప్రయాణించే అవకాశం కల్పించినట్టు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ఐదు నిమిషాలు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష కేంద్రాలలో ప్రాథమిక వైద్య సదుపాయం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయించినట్టు వివరించారు.

బోధన్ మండలంలో 13 పరీక్ష కేంద్రాలు..

బోధన్ ఉమ్మడి మండలంలో మొత్తం 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, బోధన్ అర్బన్‌లో 10 పరీక్ష కేంద్రాలు, రూరల్‌లో 3 పరీక్ష పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అర్బన్‌లో ఏర్పాటు చేసిన 10 పరీక్ష కేంద్రాలలో 2460 మంది విద్యార్థులు, రూరల్‌లో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 470 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. బోధన్ మండలంలో మొత్తం 2960 మంది విద్యార్థులు ఈ పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు.

ఆర్మూర్ : మండలంలో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మండల విద్యాధికారి రాజా గంగారాం తెలిపారు. మొత్తం 1955 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాబోతున్నారని అన్ని కేంద్రాల్లో సీఎస్‌డీఓలను నియమించినట్టు వివరించారు.

డిచ్‌పల్లి : పదో తరగతి పరీక్షల నిర్వాహణకు డిచ్‌పల్లి మండలంలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మండల విద్యాశాఖాధికారి రాజగంగారం శనివారం తెలిపారు. మండలం మొత్తంలో 1,353 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని వివరించారు.

రెంజల్ : మండలంలోని ఆదర్శ పాఠశాలను 10వ తరగతి విద్యార్థుల పరీక్షల కోసం శుభ్రం చేయించినట్టు సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ తెలిపారు. సోమవారం నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గదులను నీటితో శుభ్రం చేయించినట్టు ఆయన పేర్కొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు తెలిపారు. మండలంలోని 10 పాఠశాలల నుంచి 393 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు.

ముప్కాల్ : టెన్త్ వార్షిక పరీక్షలకు బాల్కొండ, మెండోర, ముప్కాల్ మండలాల్లో 1,076 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు బాల్కొండ ఉమ్మడి మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. మొత్తంగా ఉమ్మడి బాల్కొండ మండలంలో 8 పరీక్ష కేంద్రాలలో 1,076 మంది పదోతరగతి విద్యార్థినీ విద్యార్థులు హాజరుకానున్నారని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, తగిన పోలీసు బందోబస్తుకు ఆదేశించామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ ఏఎన్ఎం, ఆశావర్కర్ ఉండేలా చర్యలు తీసుకుంటామని, వేసవి తీవ్రత దృష్ట్యా ప్రాథమిక చికిత్స కిట్లను కూడా అందు బాటులో ఉంచుతామని అన్నారు. పరీక్ష సమయాలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులకు పలు సూచనలు జారీచేశామన్నారు.



అంగరంగ వైభోగంగా రథోత్సవం



నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన రథోత్సవము అంగరంగ వైభోగాంగా చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రథోత్సవ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రథోత్సవాన్ని పలు కాలనీలలో ఊరేగించారు. మామిడి తోరణాలతో అలంకరించి కుంభమేళ నిర్వహించి గ్రామ పెద్దలు, పనివారాలతో రథయాత్ర నిర్వహించారు. అనంతరం చావిడి ముందర భజన కీర్తనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, బుడాల నవీన్, శశి, అంబదాస్, బొడ్ల రాజు, బాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని సావర్‌గావ్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం సర్పంచ్ కిషన్, జేపీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించినట్టు టీచర్ బుజ్జిబాయి తెలిపారు. చిన్న పిల్లలకు పాఠశాలలకు పంపడం చిన్న నాటి నుండి అలవాటు చేయాలని, అంగన్‌వాడీలో పిల్లలకు పౌష్టికాహారం, ఆరోగ్య పరిక్షలు, తల్లి బిడ్డలకు , గర్భిణిలకు సంరక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, జేపీఎస్, సెంటర్ టీచర్, ఏఎన్ఎం రేష్మా, ఆశాలు ప్రేమల, తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందజేత

నేడు పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో మద్నూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో నేడు(ఆదివారం) మద్దతు ధరతో పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్టు సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ విండో కార్యదర్శి జే బాబురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొద్దుతిరుగుడు పంట పండించిన రైతులందరూ మద్దతు ధర కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వ్యవసాయ అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ రైతులు, హాజరు కవాలని కోరారు.

మంచినడవడికకు.. సప్త

నవతెలంగాణ-మద్నూర్

వారం రోజుల పాటు నిర్వహించే అఖండ శివనామ సప్త కార్యక్రమం ద్వారా ప్రజలకు చెడును దూరం చేసి మంచి మార్గాన్ని చూపిస్తాయని సప్త కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రముఖులు సూచించారు. మద్నూర్ మండలంలోని లచ్చన్ గ్రామంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న పస్త శనివారంతో ఏడోరోజుకు చేరింది. కాగాప్రతిరోజు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలంలోని అంచనూర్ గ్రామంలో శనివారం బీటీ రోడ్డు పనులను ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, అంచనూరు గ్రామం నుండి అంబర్‌పేట్ గ్రామం వెళ్లే రోడ్డు వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలనీ గ్రామస్తులు సర్పంచ్ ఎంపీటీసీ కలిసి ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకురావడంతో రోడ్డు మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో పంచాయతీరాజ్ నిధుల ద్వారా రూపాయలు ఒక కోటి 20 లక్షలతో అంచనూరు గ్రామం నుంచి అంబర్పేట రోడ్డు వరకు రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నిధులను మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్, సర్పంచ్ బురాని సమత స్వామి గౌడ్, ఉపసర్పంచ్ నరేష్ కుమార్, ఎంపీటీసీ దోర్నాల లక్ష్మి లక్ష్మణ్,పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి,వార్డు సభ్యులు కారోబార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రాక

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల మండల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గాంధారి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మమ్మాయి సంజీవ్ యాదవ్ ఒకప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుండి బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జిరాక్స్ సెంటర్లు తెరిస్తే చర్యలు

- ఎస్సై కోనారెడ్డి



జిరాక్స్ సెంటర్‌ల నిర్వహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ కోనారెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పదవ తరగతి పరీక్షలు నేపథ్యంలో పెద్ద కొడపగల్ మండల కేంద్రంలో జిరాక్స్ సెంటర్‌లు మూసివేసి ఉంచాలని, ఒకవేళ తెరిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కోనారెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలో ఉన్న జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులతో ఎస్సై కోనారెడ్డి శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తప్పనిసరిగా జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని ఒకవేళ జిరాక్స్ సెంటర్‌లు కనుక తెరిచి ఉన్నట్లయితే కఠిన చర్యలు తీసుకొని వారిపై కేసు నమోదు చేస్తామని నిర్వాహకులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకటేష్, జిరాక్స్ సెంటర్లు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ ఉత్సవాలకు ఆహ్వానం

నవతెలంగాణ-గాంధారి

ఈనెల 09, 10వ తేదీలలో తిరుపతి జిల్లా కేంద్రంలోని మహతి ఆడిటోరియంలో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు గాంధారి మండల కేంద్రానికి చెందిన కవి, రచయిత మోతీలాల్ ఆరెకటికకు శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ నుంచి శనివారం ఆహ్వానం అందింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు చేసుకునేందుకు శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 48 గంటలపాటు తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మోతీలాల్ ఆరె కటిక మాట్లాడుతూ.. ఇప్పటి వరకు శ్రీశ్రీ కళా వేదిక తరపున అవార్డులు, ప్రశంస పత్రాలు అందుకున్నానని, ఇప్పుడు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించేక్రమంలో తన పేరు నమోదు చేసి ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



మోతీలాల్

మహిళల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ధఫేదార్ శోభరాజు

నవతెలంగాణ-బిచ్కుంద

దేశంలో మహిళల కోసం అత్యధికంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం ఒక్కటే అని కామారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ దాఫెదర్ శోభ రాజు అన్నారు. శనివారం బిచ్కుంద మండలంలోని ఫథలాపూర్ గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు భోజనం, పాలు, గుడ్డుతో పాటు కేసీఆర్ కిట్ కింద నెలకు 2వేల రూపాయల చొప్పున 12వేల రూపాయలు, ఆడపిల్ల పుడితే అదనంగా మరో వెయ్యి రూపాయలు కలిపి, 13 వేల రూపాయలు ఇచ్చి, కిట్ లో ఉపయేగకరమైన వస్తువులు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ప్రజలకు ఎప్పటికప్పుడు ప్రచారం నిర్వహించి రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యే హనుమంత్ షిండే గెలుపుకు కృషి చేయాలని అన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ దఫేదర్ శోభరాజు



ఎమ్మెల్యే షిండే

నీళ్లు, నిధులు, నియామకాలు అమలు : ఎమ్మెల్సీ విట్టల్

తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ నినాదం నీళ్లు నిధులు నియామకాలు తో ముందుకు సాగిన ఉద్యమం తెలంగాణ ఏర్పాటున తర్వాత 100 శాతం అమలు చేసిందని ఎమ్మెల్సీ విట్టల్ అన్నారు. 60 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో జరగని అభివృద్ధి పనులు గడిచిన 8 ఏళ్లలో దేశంలో గర్వపడే విధంగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని కార్యకర్తలు పార్టీ నాయకులు విద్యార్థి విభాగాన్ని బలోపేతం చేసి పార్టీ కార్యచరణను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు.

86 వేల రైతులకు రైతుబంధు : షిండే

దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయాలని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తు జుక్కల్ నియోజకవర్గంలో 86 వేల రైతులకు రైతుబంధు 35 వేల మందికి ఆసరా పెన్షన్లు అందిస్తున్నామని జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హనుమంత్ షిండే అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తూ పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేశారని గ్రామాల్లోని ప్రతి ఇంటిలో తెలంగాణలో అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా అమలు చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో భీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తెలంగాణలో అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, సర్పంచ్ అరుణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్, రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలాజీ, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీహరి రాజు, ఎంపిటిసి జయశ్రీ యాదవరావు, పార్టీ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బసవరాజ్ పటేల్, సర్పంచులు గంగారెడ్డి, శివ నందప్ప, నాయకులు అసద్ అలీ, హాజీ లక్ష్మణ్, రామచందర్, నాయకులు కార్యకర్తలు ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు

- అంకోల్ క్యాంప్ బ్రిడ్జ్ వద్ద తరచూ ప్రమాదాలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్ క్యాంప్ వద్ద నిజాం కాలంలో నిర్మించిన ఇరుకు వంతెనతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. నిజాం కాలంలో నిర్మించిన ఈ బ్రిడ్జిపైనుంచే రాకపోకలు కొనసాగుతున్నాయి. బోధన్, బాన్సువాడ, హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర కు వెళ్లే ఈ దహదారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు వెడల్పు పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారు. ప్రధాన రహదారిపై తరచు ప్రమాదాలు జరుగుతున్నా రోడ్డు భవనాల అధికారులు చూసి చూడనట్లు వ్యవరిస్తున్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలో ఎక్కడ రోడ్డు శిథిలావస్థకు చేరిందన్నా సమాచారం అధికారాలకు లేకుండా పోయిందని, మండల, డివిజన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఆఫీసులకే అధికారులు పరిమితయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. నిజామాబాద్, బోధన్, నసురుల్లాబాద్, బాన్సువాడ, పిట్లం, బిచ్కుంద, నిజాంసాగర్, తదితర మండలాల ప్రయాణికులు అత్యధికంగా ఈ వంతెన మీదుగా ప్రయాణిస్తుంటారు. బ్రిడ్జి పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు బ్రిడ్జి సైడ్ గోడలు పూర్తిగా కూలిపోవడతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరగడంతో నసురుల్లాబాద్ లయన్స్ క్లబ్, అంకోల్ క్యాంప్ సర్పంచ్ ల సహకారంతో సూచిక బోర్డ్ ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి కొత్త వంతెన నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.



ఇరుకుగా మారిన వంతెన

నేడు కంటివైద్య శిబిరం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని మారుతి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించనున్న ఉచిత కంటివైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూర్పు రాజు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐటీ సెల్ చైర్మన్ మదన్ మోహన్ రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అవసరమైన వారికి మందులు కంటి అద్దాలు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తారని ఆయన తెలిపారు.

దుబాయ్‌లో రేవంత్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి బ్యానర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు నా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం రాత్రి దుబాయిలోని బుర్జ్ ఖలీఫా వద్ద ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి సుభాష్ రెడ్డి తో పాటు, టిపిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి ఫోటోలతో గల బ్యానర్‌ను ఆవిష్కరించారు.



ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రేపటి నుంచి పది పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-తాడ్వాయి

విద్యార్థుల భవిష్యత్తు నిర్దేశించే తొలి మెట్టు పదోతరగతి. పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. రేపటి (సోమవారం) నుంచి నిర్వహించనున్న పరీక్షలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్టు విద్యాశాఖాధికారులు తెలిపారు.

కాగా తాడ్వాయి మండలంలో మూడు పరీక్షా కేంద్రాల్లో 484 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగనున్నాయి. కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం వంటి ఏర్పాట్లు చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది మందులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్ష రాసేందుకు వివిద గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని కలెక్టర్ ఇదివరకే నిర్వహించిన సమావేశంలో ఆర్టీసీ డీఎంను ఆదేశించారు.



ఫైల్‌ఫొటో

ఏర్పాట్లు పూర్తి

మండల విద్యాధికారి రామస్వామి



పదోతరగతి పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో కొనసాగ నున్నాయి. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సౌకర్యాలు కల్పించాం. విద్యార్థులు పరీక్షా సమయానికి కంటే అరగంట ముందే రావాలి. మాస్ కాపీఇంగ్ కు తావులేకుండా ప్రత్యేక దృష్టి సారిస్తాం.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన



పౌష్టికాహారం అందజేత

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని తీప్పారం తండాలో గల అంగన్వాడీ కేంద్రాన్ని పర్యవేక్షణ అధికారి వినోదిని శనివారం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. పిల్లల ఎత్తు, బరువును తీయించారు. రికార్డుల ను తనిఖీ చేసి సెంటర్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు పష్టికాహారం అందజేశారు. తదనంతరం గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు బాలమృతం ,గుడ్లు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరి బాయి, సొసైటీ డైరెక్టర్ బిషాన్ నాయక్ , ఉప సర్పంచ్ లక్ష్మణ్ రావు, అంగన్వాడీ టీచర్ శారద పిల్లలు తదితరులు ఉన్నారు.

ప్రశ్నిస్తారనే సస్పెన్షన్

- రాహుల్‌గాంధీపై సస్పెన్షన్ ఎత్తివేయాలి : కాంగ్రెస్ డిమాండ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/గాంధారి/రామారెడ్డి

అదాని, అంబానికి కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తుందని ఇద్దరు కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని ఈ విషయాన్ని రాహుల్ గాంధీ గారు పార్లమెంట్ సమావేశాల్లో ప్రశ్నిస్తారనే ఉద్దేశ్యంతో పథకం ప్రకారం డిస్ క్వాలిఫై చేశారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. రెండేండ్ల పాటు ఆయనపై విధించిన సెస్పెన్షన్‌ను ఎత్తివేయకుండా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. స్థానిక ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్నా అరాచకాలను ప్రతి ఒక్కరూ గ్రామ గ్రామాన వివరించాలని కోరారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దును పునరుద్ధరించాలని లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనార్ధన్ రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహులు, ఆఫీజ్, చిరంజీవులు, రవి తదితరులు పాల్గొన్నారు.

స్పందన చూసి తట్టుకోలేక.. చిల్లర చేష్టలు



గాంధారిలో మాట్లాడుతున్న నాయకులు

గాంధారి : గాంధారి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎంపీటీసీ కామెల్లి బాలరాజు మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా నిర్వహించిన పాదయాత్రకు వస్తున్న స్పందన చూసి ప్రధాని నరేంద్ర మోడీ తట్టుకోలేక రాహుల్ గాంధీని అదుపు చేయకపోతే కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని భయంతో రాబోయే ఎన్నికల్లో బిజెపికి ఓటమి సంభవిస్తున్న భయంతో ప్రధాని చిల్లర చేష్టలు చేస్తూ రాహుల్ గాంధీ పై అనర్హత వేటు వేశారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లైన్ రమేష్,యం డి మదార్, బద్దం వెంకట్ రెడ్డి, మోహన్ నాయక్, సంగెం రాజు, జశ్వంత్ గౌడ్ పాల్గొన్నారు.

మోడీ నియంతృత్వ పాలనను ఎండగడదాం

రామారెడ్డి : కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నియంతృత్వపాలను ఎండగట్టాలని శనివారం జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమకు అనుకూలంగా లేకుంటే, ఈడీ కేసులు, సిబిఐ సోదాలు, పార్లమెంటు సభ్యత్వాన్ని తొలగించటం వంటి, అప్రజాస్వామిక చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, మతాల మధ్య చిచ్చు పెట్టి, రాజకీయంగా లబ్ధి పొందాలని చూడటం అప్రజా స్వామికమని పేర్కొన్నారు. చాయ్ వాలా అని చెప్పుకుంటూ చాయ్ అమ్మినట్టు ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించటం, అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న తీరును లెక్కలతో సహా పార్లమెంటులో ప్రస్తావించినందుకు కక్ష పెంచుకున్నట్టు తెలిపారు. భారత్ జోడోయాత్రలో రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడితే, బిజెపి నాయకులు, బిజెపి ప్రభుత్వం, కళ్ళు మండి, కక్షపూరితంగా రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.



లింగంపేట్‌లో మాట్లాడుతున్న నాయకులు

సభ్యత్వం రద్దు.. సిగ్గుచేటు

లింగంపేట్ :

రాహుల్ గాంధీని పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మండిపడ్డారు. శనివారం లింగంపేట్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్లమెంట్ నుంచి రాహుల్ గాంధీని రెండు సంవత్సరాల పాటు అనర్హత వేయడంలో బిజెపి ప్రభుత్వం హస్తం ఉందని అన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మాసుల శివయ్య, సీనియర్ నాయకులు బద్ద చందు, ముస్తాపూర్ కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకోల్‌క్యాంప్‌నకు 80 లక్షల నిధులు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రాము

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలంలో ఆదర్శంగా నిలిచిన అంకోల్ క్యాంప్ గ్రామానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి సుమారు 80 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు గ్రామ సర్పంచ్ రాము తెలిపారు. శనివారం అంకోల్ క్యాంప్ గ్రామస్తులతో సర్పంచ్ రాము సమావేశం నిర్వహించారు. ఈ నిధుల్లో 45 లక్షలతో నిధులలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం, 10 లక్షలతో కాజ్వే కోసం, 10 లక్షల రూపాయలతో కురుమ కమ్యూనిటీ హాల్ భవనం నిర్మాణం, నాలుగు లక్షలతో రైతులు పొలంలోకి వెళ్ళటానికి మట్టి రోడ్డు, పొలాల్లోకి వెళ్ళటానికి వంతెన నిర్మాణం, 20 లక్షలతో నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ నిధులతో నాణ్యమైన పనులు చేయించడాని కోసం నేడు సమావేశం ఏర్పాటు చేసి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ కమిటీని ఏర్పాటు చేసి ఆ పనులను కమిటీకి అప్ప చెప్పినట్టు తెలిపారు. అభివృద్ధి పనులను మంజూరు చేసిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

బాసర సరస్వతిని దర్శించుకున్న నగర మేయర్



నవతెలంగాణ-కంఠేశ్వర్

బాసర సరస్వతి అమ్మవారిని నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మేయర్‌కు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ విలాస్ రావ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్యామ్ ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడి మృతి

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో రైలు కిందపడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తు జారీ పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడని అతని వద్ద ఎటువంటి సమాచారం దొరకకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని పంచానామా నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఎవరికైనా అనుమానాలు ఉంటే రైల్వే పోలీసులకు సంప్రదించాల్సిందిగా కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ కర్తవ్యం

- ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా
- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ కర్తవ్యమని ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా అన్నారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం 34 మంది బాధితులకి రూ.10,37,000 సీఎంఆర్ఎఫ్- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్‌తో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తుందని, ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్య సదుపాయాలు మెరుగు పరిచి నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. గర్భిణీ స్త్రీలకు సాధారణ ప్రసవాలు చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. అత్యవసర సమయాల్లో ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బిగాల

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులతో పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 42 చెక్కులను ధర్పల్లి జెడ్పీటీసీ, జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్ చేతుల మీదగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కన్నెరాం లత, జెడ్పీటీసీ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షులు మధుకర్ రావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్లు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోమన్‌పల్లి విద్యార్థులకు అభినందన



ఉపాధ్యాయులను అభినందిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

తెలుగు తల్లి మెడలో పద్యాల హారం అనే శీర్షికన ఈ నెల 26 ఆదివారం ఈటీవీ తెలంగాణ 360లో కోమన్‌పల్లి విద్యార్థుల పద్య పఠన, పంచశతక ధారణ ప్రతిభను ప్రసారం చేశారు. దీంతో తమ గ్రామ విద్యార్థుల ప్రతిభకు సంతోషించి సర్పంచ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూలూరి నర్సయ్య, తెలుగు భాషోపాధ్యాయులు నాగుల రాజేందర్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ నీరడి రాజేశ్వర్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ లోచారం నారాయణ, ఉపాధ్యక్షులు రోహన్‌గౌడ్, కోశాధికారి పోశెట్టి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, ఆనంద్, శ్రీనివాస్, చిన్నయ్య, సాయన్న, గోపాల్, జయశ్రీ, గడ్డి చిన్నయ్య, రాజేందర్ గౌడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఇద్దరు ఆత్మహత్య

- పిల్లలు కాలేదని ఒకరు..
- అప్పుల బాధతో మరొకరు..

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి తాగుడికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డట్లు రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పూర్ణేశ్వర్ శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోటగల్లికి చెందిన మల్లపుర్తి యాదగిరి (40) అనే వ్యక్తి మెస్త్రీ పని చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. అయితే అతనికి 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. పెళ్లయినప్పటి నుంచి అతనికి పిల్లలు కాలేరు. ఈ విషయంలో మనోవేదనకు గురై తాగుడుకు బానిసయ్యాడు. వారం రోజుల క్రితం భార్యభర్తల మధ్య గొడవ చోటుచేసుకోవడంతో భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. శుక్రవారం రాత్రి 9:30 గంటలకు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మరొకరు..

నగరంలోని రెండో పోలీస్ స్టేషన్ పరిధిలో అప్పుల బాధతో ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రెండవ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పూర్ణేశ్వర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బురుడుగల్లికి చెందిన మామిడోళ్ల శ్రీకాంత్ (30) కూలి పని చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. అయితే అతను సంపాదించే మొత్తాన్ని తన మద్యం తాగడానికి ఖర్చు చేసేవాడు. అలాగే అప్పులు కూడా ఎక్కువయ్యాయి. ఈ బాధ భరించలేక శుక్రవారం రాత్రి 9 గంటలకు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి మామిడాల రుక్మ భూపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్ ఫేజ్ మోటర్లు ఏర్పాటు



సింగిల్‌ఫేజ్ మోటర్లను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ఒకటవ వార్డులో సింగిల్ ఫేస్ కొత్త మోటర్‌ను బిగించినట్టు సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. వేసవికాలం రావటంతో ముందు జాగ్రత్తగా తాగు నీటి ఎద్దడి రాకుండా సింగిల్ ఫేజ్ మోటార్‌ను బిగించినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో మరో సింగిల్ ఫేస్ మోటర్‌ను బిగించినట్లు ఆయన పేర్కొన్నారు.

సుద్ధపల్లిలో నేడు జిల్లా మినీ-సబ్-జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 2న జిల్లా మినీ-సబ్-జూనియర్ (అండర్-10) సాఫ్ట్‌బాల్ బాల బాలికలకు టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ గోదావరి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు 01-01-2013 తర్వాత జన్మించి ఉండాలని, ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు ఉదయం 07 గంటలకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు నల్లూరి లత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనికకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ ఫౌండేషన్ అవార్డులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ శివారులోని గాంధీనగర్‌లో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జరిగిన విద్యార్థుల అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటీ నీట్ ఫౌండేషన్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే పాఠశాల స్థాయి నుంచి అన్ని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన అన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే అన్ని సబ్జెక్టుల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని వివరించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఐఐటీ నీట్ ఫౌండేషన్ పరీక్షలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన ఏడుగురు విద్యార్థులు రమోలారాజ్, సంజనగౌడ్, హర్షిని, సాత్విక్, శ్రీవిద్య, రిషిత్‌కు నగదు బహుమతులు అందజేశారు. ఆరవ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో సాధించిన ర్యాంకులను బట్టి వారికి అవార్డులు ప్రదానం చేశారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి అవార్డులను స్వీకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలు సాధించిన అవార్డుల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ విద్యార్థులను నిష్ణాతులుగా తయారు చేస్తున్న ఉపాధ్యాయులని అభినందిస్తూ వారి వారి అభిప్రాయాలను కార్యక్రమంలో పంచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్, పాలనాధికారిని పద్మ, ప్రిన్సిపాల్ రమేష్, పాఠశాల ఇంచార్జ్ నృపన్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

టీడీపీ బోధన్ నియోజకవర్గ ఇంచార్జీగా కోట గోపాల్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్



తెలుగుదేశం పార్టీ బోధన్ నియోజకవర్గ ఇంచార్జిగా మావంది కలాన్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కోట గోపాల్‌రెడ్డిని నియమిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీని బలోపేతం చేయటంలో భాగంగా ఖాళీగా ఉన్న నియోజకవర్గ బాధ్యులను నియమించాలనే నిర్ణయం మేరకు బోధన్ నియోజకవర్గానికి కోట గోపాల్‌రెడ్డిని నియమిస్తూ తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బోధన్ నియోజకవర్గ పార్టీ బాధ్యతలను అప్పగించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జ్ఞానేశ్వర్‌కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టానికి తన వంతుగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

30 వరకు దరఖాస్తులు చేసుకోవాలి

- తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్

నవతెలంగాణ-ఆర్మూర్



జీవో నంబర్ 58, 59 ద్వారా అర్హులైన వారు ఏప్రిల్ 30 వరకు 100 గజాలలోపు ఇండ్ల స్థలాల రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు మీ సేవల్లో దరఖాస్తులు చేసుకోవాలని పట్టణ తహసీల్దార్ వేణు గోపాల్ గౌడ్ శనివారం తెలిపారు. ప్రభుత్వం గడువు పొడిగించినట్టు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

విద్యార్థులకు దోమ తెరల పంపిణీ

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతనానికి నిరంతరం కృషి చేస్తానని, బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కెప్టెన్ కరుణాకర్ రెడ్డి అన్నారు. శనివారం బోధన్ నియోజకవర్గంలో దోమతెరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బోధన్ పట్టణంలోని నిజామియా ఉన్నత పాఠశాల, దారుల్ ఉలూమ్ ఉర్దూ పాఠశాలలోలి విద్యార్థులందరికీ దోమతెరలు పంపిణీ చేశారు. కెప్టెన్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు దోమ కాటు వ్యాధుల బారిన పడకుండా ఉండాలని ఈ దోమతెరలు ప్రతి ఒక్కరూ వాడాలని తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి దోమతెరలు చేరవేస్తామని, ఇప్పటివరకు 50,000 దోమతెరలు పంపిణీ చేశామని, లక్ష దోమతెరలు పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నామని ఆయన అన్నారు. బోధన్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. యువకులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా యువకులందరికి హెల్మెట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలతో ముందుకు వస్తామని, ప్రజల ఆరోగ్యం, అభివృద్ధియే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎడపల్లి మాజీ ఎంపీపీ భాస్కర్ రాజ్, బోధన్ మాజీ కౌన్సిలర్ ఫయాజుద్దీన్, కాజాఖలీల్‌ఉల్లా, రాజగుప్త, ఒడ్డెన్న, మాజిద్ ఖాన్, షాకిర్, కౌన్సిలర్ సమీర్, సనా పటేల్, యాసీన్, మోసిన్, కరుణన్న యువసేన నాయకులు రాజశేఖర్, వాగ్మారె ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



దోమతెరలు పంపిణీ చేస్తున్న కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి

ఏప్రిల్‌ను మహనీయుల మాసంగా ప్రకటించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

సమాజంలో ఏప్రిల్ నెల వచ్చిందంటే పిల్లలు పెద్దలు ఎప్పుడు చెప్పినట్టు ఏప్రిల్ ఫూల్ అని అంటారని, అది కాదని మహనీయులు జన్మించిన నెల అని దళిత ఐక్య సంఘం డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి జంగం అశోక్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. దేశానికి గొప్ప నాయకులను అందించిన ఉత్తమమైన నేల అని, అంటరానితనం, వివక్షాలపై అలుపెరగని పోరాటం చేసి అస్తిత్వ ఉద్యమాలకు దశ దిశలను చూపిన స్ఫూర్తి ప్రదాత భారత రాజ్యాంగ నిర్మాత భారత రత్న అంబేద్కర్, జగ్జీవన్ రావ్ జన్మించిన నెల అని అన్నారు. ఈ నెలను మహనీయుల మాసంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

నాగపూర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. రాష్ట్ర రోడ్లు భవనాలు గృహ నిర్మాణ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో గ్రామానికి సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులతో చేపడుతున్న పలు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు భూమి పూజ చేసి ప్రారంభించారు. సీసీ రోడ్ల నిర్మాణంలో భాగంగా గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వరకు సిమెంటు రోడ్డును వేశారు. ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యం సిమెంటు రోడ్డు వేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భక్తులు, గ్రామ ప్రజలు మంత్రి ప్రశాంత్‌రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సాదుల్లా రాజన్న, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు రాకేష్, మండల నాయకులు రవికిరణ్, శ్రీకాంత్, దేవేందర్, గణేష్, హరీష్, మల్లేష్, మనోజ్, రాజన్న, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గాను అంగన్వాడీ టీచర్‌కు గుర్తింపు

నవతెలంగాణ-బోధన్

సాలుర మండలం హున్స గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ చీల లావణ్య తన రోజువారి విధుల నిర్వహణలో ఉత్తమ సేవలకు, పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆమె అందించిన సేవలకు గాను, రికార్డుల నిర్వహణలో ఆమె జిల్లా స్థాయిలో ఉత్తమ అంగన్వాడీ టీచర్‌గా అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు ఆమెకు ప్రశంస పత్రాన్ని అందించి అభినందించారు. భవిష్యత్తులో ఐసీడీఎస్ ద్వారా మహిళలకు, చిన్నారులకు మరిన్ని ఉత్తమ సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చిత్ర మిశ్రా, మహిళా కమిషన్ చైర్మెన్ ఆకుల లలిత, మహిళ సంక్షేమ అధికారి సుధా, సీడీపీఓ జానకి, సూపర్‌వైజర్లు గంగావేణి పాల్గొన్నారు.



జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న లావణ్య

మోడీ ప్రభుత్వం ఔషధాల ధరల పెంపును విరమించుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మోడీ ప్రభుత్వం ఔషదాల ధరల(మందుల) పెంపును విరమించుకోవాలని సీపీఐఎంఎల్ రామచంద్రన్ పార్టీ ఉత్తర తెలంగాణా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై పన్నుల భారం మోపడంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచిందని, అది చాలక నేడు సాధారణ, మధ్యతరగతి ప్రజలు రోగం, నొప్పులకు వాడే ఔషదాలను (టాబ్లెట్‌లను) సైతం 12 శాతానికి పెంచుతూ సామాన్యులను రోడ్డున పడేస్తుందన్నారు. ఇప్పటికే ప్రజలు కరోనా మహమ్మారి కారణంగా ఆర్థికంగా నష్టపోయి కోలుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని, ప్రజలపై పన్నుల, అధిక ధరల భారాన్ని తగ్గించాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు, బహుళజాతి సంస్థలకు లక్షల కోట్ల రూపాయలకు రాయితీ ఇచ్చి, ఆ లోటు పూడ్చడానికి సామాన్య, మధ్యతరగతి రెక్కాడితేగానీ డొక్కాడని ప్రజలపై అధిక భారాన్ని మోపుతున్నారని తెలిపారు. మరోవైపు దేశభక్తి పేరు చెపుతూనే దేశ, ఖనిజ సంపదను, వనరులను, ప్రభుత్వం రంగ సంస్థలను పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెడుతున్నారన్నారు.

మాదకద్రవ్యాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలి

నవతెలంగాణ-బోధన్

మాదక ద్రవ్యాల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి ఆదేశించారు. శనివారం బోధన్ కోర్టులో నిర్వహించిన పోలీస్ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, నిజామాబాద్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనరసయ్య ఆదేశాల మేరకు బోధన్ కోర్టు ప్రాంగణంలో మాదకద్రవ్యాల నిరోధక చట్టం అమలుపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కేసులలో చేపట్టవలసిన చర్యలపై, తీర్పులపై అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య పోలీసు అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు ప్రేమ్ కుమార్, జాన్‌రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు సందీప్, నవీన్, మచ్చేందర్ రెడ్డి అనిల్‌రెడ్డి, రవీందర్, బాలయ్య, ఏఎస్ఐ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాణి

కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-ముప్కాల్

భజరంగ్ దళ్ జిల్లా ఆధ్వర్యంలో చేపట్టే వీర హనుమాన్ విజయ యాత్ర కరపత్రాలను విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విశ్వహిందూ పరిషత్తు కార్యనిర్వాహక అధ్యక్షులు కత్రాజి నరేంధర్ మాట్లాడుతూ యువకులు చెడు మార్గంలో నడవకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో భజరంగ్ దళ్ సప్తహి ప్రముఖ నాగుల పవన్ గౌడ్, ప్రఖండా భజరంగ్ దళ్ సాహసం యోజక్ అభినవ్ తదితరులు పాల్గొన్నారు.